క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.9.18లక్షలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్య క్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ. 9.18 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం కానుకల హుండీని లెక్కించారు. లెక్కింపు నిర్వహించారు. 33రోజులకు సంబంధించిన ఈ హుండీ లెక్కింపులో నగదుతోపాటు బంగారం 15గ్రాములు, వెండి 55 గ్రాములు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ హేమలతాదేవి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

790 మంది విద్యార్థులు హాజరు



జగ్గయ్యపేట అర్బన్ : పదోతరగతి పరీక్షల్లో చివరిదైన సంస్కృతం పరీక్షకు గురువారం 790మంది విద్యార్థులు హాజరయ్యారు. దీంతో పదోతరగతి పరీక్షలు ముగిశాయని, ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన పరీక్ష ఈనెల 30వతేదీ జగ్గయ్యపేటలోని జెడ్పీ హైస్కూల్‌లో జరుగనుందని ఎంఈవో ఎల్ చిట్టిబాబు తెలిపారు. పదోతరగతి పరీక్షలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 2847మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా మండలాల ఎంఈవోలు చిట్టిబాబు, డి.రవీంద్రర్, నాగరాజు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పేట సీఐ జానకీరామ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు సూర్యభగవాన్, పద్మారావు, సతీష్, రాంబాబు, అభిమన్యు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

అక్రమ లేఅవుట్ల తొలగింపు



నందిగామ: సరైన అనుమతులు లేకుండా అక్రమంగా వేసిన లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఎవ్వరూ మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని సూచించారు. పట్టణంలోని రైతుపేట డౌన్ ప్రాంతంలో పలుచోట్ల వేసిన అక్రమ లేఅవుట్లను గురువారం తొలగించారు. సరిహద్దు రాళ్లు తొలగించడంతోపాటు రోడ్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ నందిగామ మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కొందరు వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. వెంచర్లు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు తీసుకోవాలన్నారు. ఆయా వెంచర్లకు సరైన అనుమతులు ఉన్నదీ లేనిది స్పష్టంగా తెలుసుకున్న తర్వాతనే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. అక్రమ లేఅవుట్ల తొలగింపు కార్యక్రమాన్ని టౌన్ ప్లానింగ్ విభాగం సూపర్‌వైజర్ ఏఎస్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



గరికపాడు(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టు వద్ద భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, విజయవాడ సీపీ టీకే రాణా ఈ చెక్ పోస్టును తనిఖీ చేసి పోలీసులకు తగు సూచనలు ఇచ్చిన నేపథ్యంలో పోలీసులు భద్రతను మరింత పెంచారు. తెలంగాణ నుంచి రాష్ట్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలను సైతం తనిఖీల అనంతరమే అనుమతిస్తున్నారు. అక్రమ నగదు, మద్యంతోపాటు మాదక ద్రవ్యాలు వంటివి రాష్ట్రంలోకి రాకుండా నిఘాను ఏర్పాటు చేశామని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఎంసీసీ బృందాలతో సమీక్ష



నందిగామ: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందాలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఏ రవీంద్రరావు సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ఎంసీసీ బృందాల సభ్యులతో గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవీంద్రరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంసీసీ బృందాల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనుమతులు లేకుండా రాజకీయపార్టీల సభలు, సమావేశాలు , ప్రచారాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, నియోజకవర్గ పరిధిలోని ఎంసీసీ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



తనను ఆదరించాలని కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అందించిన కరపత్రాన్ని ఆసక్తిగా చదువుతున్న ఓటరు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రజల మద్దతు, సహకారంతోనే నందిగామను అభివృద్ధి చేయగలిగానని ఎమ్మెల్యే, నందిగామ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి మరోసారి తనను ఆదరించాలని ప్రజలను కోరారు. నందిగామ పట్టణంలోని నాలుగోవార్డు పరిధిలోని మెయిన్ బజార్, కాకుళయ్య వీధి తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరించారు. నందిగామ పట్టణంలో చేసిన అభివృద్ధి వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ముందుగా ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకు ప్రజలు ఎదురేగి స్వాగతం పలికి ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రజలకు చేయగలిగినంత మంచి చేస్తున్నామన్నారు. ఐదేళ్లలో సమర్థవంతమైన పాలన అందించామనడానికి నందిగామలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటే నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంతో ప్రతిష్టాత్మక కేంద్రీయ విద్యాలయంతో ఈప్రాంత నిరుపేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందనుందన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు జాతీయస్థాయి విద్యనందించేందుకు కేంద్రీయ విద్యాలయం కావాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే తక్షణమే స్పందించిన ఆయన విద్యాలయ మంజూరుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్నా ప్రతిపక్ష పార్టీలకు నచ్చడం లేదని, కోర్టులను ఆశ్రయించి అడ్డుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయలతో నందిగామను తీర్చిదిద్దిన వైనాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మరోమారు ఆదరించి అవకాశం కల్పిస్తే చేపట్టిన ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేయడం ద్వారా నందిగామ పట్టణాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించి ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని కాంక్షించే ప్రతిఒక్కరు తనకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు ముప్పల శ్రీను, నల్లమల్లి మురళి, సూరె రామారావు, పరిశ మల్లి, సముద్రాల మధు, పాములపాటి రమేష్, నాదెండ్ల నరేంద్ర, గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, జాఫర్, ఓర్సు జ్వాలా, కరి రవీంద్ర, కొండ, షేక్ సుభాని, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన ధర్మవరప్పాడుతండా వాసులతో విప్ ఉదయభాను



పార్టీలో చేరిన వారితో వెంకటకృష్ణ ప్రసాద్

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని ధర్మవరప్పాడుతండాకు చెందిన బాణావత్ సక్రు, కృష్ణ, గోపి, నరసింహ, భూక్యా ఆంజనేయులు, షేక్ షహీలా, నాగమణి, బుజ్జి, మంగ, గోప్యా తదితరులు టీడీపీని వీడి గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి విప్ ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధితోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైనాన్ని గమనించి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ భూక్యా జ్వాలా, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పాండురంగారావు, శ్రీరాములు నాయక్, సక్రు నాయక్, రవీంద్ర పాల్గొన్నారు.

తొర్రగుంటపాలెం నుంచి...

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలేనికి చెందిన పప్పుల వెంకట్రావు, దుర్గారావు, నల్లగొండ నాగలక్ష్మి, మహిమ, అంజలి, నాగరాణి, తిరుపతమ్మతోపాటు పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీలోకి చేరినవారు మాట్లాడుతూ టీడీపీ వాళ్ల మోసపూరిత మాటలు నమ్మి ఆపార్టీలోకి వెళ్లామని, ఆపార్టీ విధి విధానాలు నచ్చక తిరిగి సొంత గూటికి చేరినట్లు వివరించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పొంగళ్లతో క్యూలైన్లలో భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల నాలుగోరోజు గురువారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లుతో పాటు పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడుతో పాటు మండలంలోని ముచ్చింతాల, వెంకటాపురం, గుమ్మడిదుర్రు, శివాపురం గ్రామాల నుంచి చిన్న దూడలు, గొర్రెలతో బండ్లు కట్టడంతోపాటు సైకిళ్లకు, ఆటోలకు ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులకు రామ్‌కో సిమెంట్స్ వారు పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ ఈవో కె రమేష్‌నాయుడు, రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో సేద తీరారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తులు కోలాహలం కనిపించింది.



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



పులిహోర పంపిణీ చేస్తున్న ఈవో రమేష్ నాయుడు, 'రామ్‌కో' ప్రెసిడెంట్ శ్రీవాత్సవ



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ



నందిగామ: చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. నందిగామ మండల పరిధిలోని జొన్నలగడ్డ వద్దనున్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును గురువారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీని పరిశీలించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యేంతవరకు చెక్‌పోస్టుల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మద్యం, నగదు రవాణాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ హనీష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు): మద్యం, నగదు, మాదకద్రవ్యాలు అక్రమరవాణా చేస్తే సహించేది లేదని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా తెలంగాణ నుంచి వచ్చే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే రాష్ట్రంలోకి అనుమతించాలని సూచించారు. వాహనాలలో నగదు, మద్యంతోపాటు అనుమానాస్పద వస్తువులు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.

205 మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బృందం గురువారం దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 205 మద్యం సీసాలతోపాటు రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం వల్లభి గ్రామానికి చెందిన ఓవ్యక్తి, షేర్‌మహ్మద్‌పేటకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వివరించారు. గండ్రాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సునీల్‌కుమార్‌తోపాటు ఇంటిలిజెన్స్ డీటీఎఫ్ మైలవరం ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని అడవిరావులపాడులో సహాయత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫీడ్‌ద హంగ్రీ–2024లో భాగంగా పేద ముస్లిం కుటుంబాలకు గురువారం ఆయన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్‌మాసంలో పేదలకు సహాయత ట్రస్ట్‌వారు నిత్యావసర సరుకులు అందించడం సంతోషకరమంటూ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మౌలానా ఇసాక్ సాహెబ్, షేక్ మిన్ హజ్, నాయకులు షేక్ జాని, షేక్ హమీద్, ఆకుల హనుమంతరావు, సూరా కొండ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య హేమచంద్రారెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని మరింత సమర్థవంతంగా ఎదగాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్రారెడ్డి అన్నారు. కేబీఎన్ 59వ వార్షిక వేడుకలు కళాశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యారంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు విద్యావిధానంలో అనేక నూతన మార్పులను తీసుకొచ్చామన్నారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమలోని నైపుణ్యాలను పదును పెట్టుకుంటే జీవితంలో చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సింగిల్ మేజర్ సబ్జెక్ట్ వంటి అనేక సంస్కరణలను అమలు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ వెస్ట్‌జోన్ డీసీపీ టి.హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయటానికి పాటుపడాలన్నారు. మిజోరాం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాధిపతి ఆచార్య దివాకర్ తివారి మాట్లాడుతూ కళాశాల సాధిస్తున్న విజయాలను అభినందించారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు టి.శేషయ్య, తునికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 118 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల 59 సంవత్సరాలుగా సామాజిక వికాసానికి పాటుపడుతోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో కళాశాల సాధించిన విజయాలను వివరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'నండ్రు'



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

నందిగామ: నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నండ్రు బాబు విద్యాసాగర్, అద్దంకి మణిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ప్రక్రియను గురువారం నిర్వహించగా, ఎన్నికల అధికారిగా నండ్రు శ్రీరామ్మూర్తి వ్యవహరించారు. బార్ అసోసియేషన్ ట్రెజరర్‌గా చాట్రగడ్డ రవికుమార్, ఉపాధ్యక్షుడిగా కురగంటి కృష్ణంరాజు, సహాయ కార్యదర్శిగా ఎక్కిరాల హనుమంతరావు, గ్రంథ పాలకుడుగా ఆనందం విజయభాస్కర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ కార్యదర్శిగా గుగులోత్ రామారావు, మహిళ సంరక్షణకారిగా కురగంటి ప్రవీణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



శ్రీసీతారామస్వామి, రాజ్యలక్ష్మీదేవి అమ్మవార్లు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

వైభవంగా సీతారామస్వామి ఆలయ ప్రతిష్ట

కంచికచర్ల పెద్దబజారులోని సీతారామస్వామి, శ్రీరాజ్యలక్ష్మీదేవి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ, విమాన శిఖర, రాజగోపుర, విగ్రహ, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఆలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని స్వామివార్లను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు ఆయనకు సాదరస్వాగతం పలికి వేదఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి శేషవస్త్రంతో ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. – కంచికచర్ల